# వర్మ 'సిండికేట్'



గత కొంతకాలంగా తాను తీస్తున్న సినిమాల పట్ల ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఇటీవల తన సోషల్‌మీడియా పోస్ట్‌లో పశ్చాత్తాపం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. 'సత్య' సినిమా చూసినప్పుడు కన్నీళ్లొచ్చాయని, తాను ప్రేక్షకుల నమ్మకాన్ని కోల్పోయానని, ఇక నుంచి తన స్థాయి ప్రమాణాలతో సినిమాలు చేస్తానని ప్రతిజ్ఞ కూడా చేశారు. ఆ దిశగా అడుగులు వేయడానికి ఆయన కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో 'సిండికేట్' పేరుతో రామ్‌గోపాల్‌వర్మ కొత్త చిత్రాన్ని ప్రకటించారు. 'అత్యంత భయంకరమైన జంతువు ఒక్క మనిషి మాత్రమే' అనే పాయింట్ నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు ప్రకటించారు. '70దశకంలో ఉండే వీధి రౌడీలు అనంతరం రాజకీయాలను వృత్తిగా చేపట్టడంతో కనుమరుగయ్యారు. బంగారం, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల స్మగ్లర్లు ఆర్థిక సంస్కరణ వల్ల ఆ వృత్తిని వదిలేశారు. ముంబయి డీ కంపెనీ, అల్‌ఖైదా వంటి టెర్రరిస్ట్ సంస్థలు పతనావస్థకు చేరాయి. వీరందరికి కంటే ప్రమాదకరంగా ఇప్పుడు 'సిండికేట్' రాబోతున్నది. ఇది రాజకీయ సంస్థలు, రాజకీయాలు, బడా పారిశ్రామిక వేత్తలు, మిలిటరీ కలబోసిన పవర్‌ఫుల్ 'సిండికేట్'. ఆధునిక భారతాన్ని ప్రమాదంలో నెట్టేసే భయంకరమైన కూటమి. నేరం కాలానికి అనుగుణంగా ఎలా రూపాన్ని మార్చుకుంటుందో ఈ సినిమాలో చూడబోతున్నారు. ఇదొక ఫ్యూచరిస్టిక్ సినిమా అనుకోవచ్చు. సమీప భవిష్యత్తుకు అద్దం పడుతుంది. గత కొంతకాలంగా దర్శకుడిగా నేను చేసిన తప్పులను, వైఫల్యాలను ఈ 'సిండికేట్' తుడిచివేస్తుందని వాగ్దానం చేస్తున్నా' అని రామ్‌గోపాల్‌వర్మ పేర్కొన్నారు.

# పరదా వెనకున్న రహస్యం



'ఈ టీజర్ చూసినప్పుడు నా పదేళ్ల జర్నీ కనిపించింది. చాలా ఎమోషనల్ అయ్యాను. ఇన్నేళ్లలో నా ఫేవరేట్ మూవీ ఇది. నేను పోషించిన సుబ్బు పాత్ర అందరికి కనెక్ట్ అవుతుంది' అని చెప్పింది అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'పరదా'. 'ఇన్ ది నేమ్ ఆఫ్ లవ్' ఉపశీర్షిక. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకుడు. విజయ్ డొంకడ నిర్మాత. దర్శన రాజేంద్రన్, సంగీత కీలక పాత్రల్ని పోషించారు. బుధవారం చిత్ర టీజర్‌ను మలయాళ అగ్ర హీరో దుల్కర్ సల్మాన్ సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. సుబ్బు పాత్ర పరిచయంతో టీజర్ ప్రారంభమైంది. ముగ్గురు స్నేహితురాలు సుదూర యాత్రకు బయలుదేరడం, ఈ ప్రయాణం ఆసాంతం సుబ్బు పరదా ధరించి ఉండటం, ఆ తర్వాత గ్రామంలోని దేవత నేపథ్యంలో వచ్చే సన్నివేశాలతో టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. సుబ్బు ధరించే పరదా వెనకున్న రహస్యమేమిటన్నది సస్పెన్స్‌గా మిగిలింది. మహిళా ప్రధాన చిత్రంగా మెప్పిస్తుందని దర్శకుడు తెలిపారు. మలయాళ రైట్స్‌ను హీరో దుల్కర్ సల్మాన్ తీసుకున్నాడని, విజయంపై నమ్మకంతో ఉన్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్, నిర్మాణ సంస్థ: ఆనంద మీడియా, దర్శకత్వం: ప్రవీణ్ కండ్రేగుల.

# తెరపైకి తెలంగాణ వీరుల కథలు



'రజాకార్ల అకృత్యాలకు ఈ సినిమా గొప్ప డాక్యుమెంటరీ. ఈ సినిమాలో వీరనారి చాకలి ఐలమ్మ పాత్రలో నటించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా' అని చెప్పారు సీనియర్ నటి ఇంద్రజ. సమర్‌వీర్ క్రియేషన్స్ పతాకంపై బాబీ సింహా, వేదిక, అనిష్క త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ ప్రధాన పాత్రల్లో రూపొందించిన 'రజాకార్' చిత్రం గత ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చింది. యాటా సత్యనారాయణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. ఈ నెల 24న నుంచి ఈ సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ.. 'ఈ సినిమాకు ఎన్నో అవార్డులొచ్చాయి. తెలంగాణ చరిత్రలో గొప్ప వీరులకు సంబంధించిన 20 కథలు నా దగ్గర ఉన్నాయి. అవకాశాన్ని బట్టి వాటిని సినిమాలుగా తెరకెక్కిస్తా' అన్నారు.

# అలాంటి పనులు నచ్చవు!



అగ్ర కథానాయిక సాయిపల్లవి ప్రతిభాపాటవాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమా ఎంపికలో చాలా సెలెక్టివ్‌గా ఉండే ఆమె తాను పోషించే ప్రతీ పాత్రకు పరిపూర్ణంగా న్యాయం చేస్తుంది. సాయిపల్లవి ఓ సినిమాకు ఒప్పుకుందంటే అందులో మంచి కంటెంట్ ఉంటుందని ప్రేక్షకులు భావిస్తారు. గత ఏడాది 'అమరన్'తో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈ భామ ప్రస్తుతం భారీ చిత్రాలతో బిజీగా ఉంది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత ఇష్టాయిష్టాల గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ప్రతి ఒక్కరికి కొన్ని భయాలుంటాయని, తాను కూడా వాటికి అతీతురాలిని కాదని చెప్పింది. పబ్లిక్ ప్లేస్‌లోకి వెళ్లినప్పుడు అందరూ తననే చూస్తున్నారనే భావన వల్ల కాస్త భయంగానూ, బిడియంగానూ ఉంటుందని తెలిపింది. తనను ఎవరైనా అభినందించినా ఏదో తెలియని టెన్షన్ ఫీలైనట్లు అనిపిస్తుందని సాయిపల్లవి పేర్కొంది. అన్నింటికంటే ముఖ్యంగా తన అనుమతి లేకుండా ఎవరైనా ఫొటోలు తీస్తే అస్సలు నచ్చదని, అడిగి తీసుకుంటే బాగుంటుంది కదా అని సలహా ఇచ్చింది. ఒక్కోసారి ఓవర్‌థింకింగ్ వల్ల ఆలోచనలు ఎక్కడికో వెళ్లిపోతాయని, వాటిని నియంత్రించుకోవడానికి నిత్యం ధ్యానం చేస్తున్నానని సాయిపల్లవి చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ సొగసరి తెలుగులో తండేల్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తూ రణబీర్‌కపూర్ సరసన 'రామాయణ' చిత్రంలో నటిస్తున్నది.




నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రామ్ దేశినా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై చింతలపూడి శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. విధి కథానాయికగా నటిస్తున్నది. బుధవారం నాగశౌర్య పుట్టిన రోజు సందర్భంగా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్‌టైనర్ ఇదని, నాగశౌర్య మునుపెన్నడూ చూడని విధంగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తాడని మేకర్స్ తెలిపారు. చిత్రీకరణ తుది దశకు చేరుకుందని నిర్మాత తెలిపారు. సముద్రఖని, వీకే నరేష్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్).

# వినోదమే నా బలం

**వీల్‌చైర్లో వచ్చి సినిమా చూశారు • నాగార్జునతో తప్పకుండా సినిమా చేస్తా**



దర్శకుడిగా పదేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు అనిల్ రావిపూడి. 'పటాస్'తో శ్రీకారం చుట్టి ప్రస్తుతం 'సంక్రాంతి వస్తున్నాం' వరకు వచ్చారు. ఈ పదేళ్లకాలంలో ఆయన ఎనిమిది సినిమాలను డైరెక్ట్ చేయగా.. అవన్నీ సూపర్ హిట్స్ కావడం విశేషం. తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' రెండొందల కోట్ల వసూళ్ల క్లబ్‌లోకి చేరడంతో దర్శకుడిగా ఆయన మరో మైలురాయిని చేరుకున్నట్లైంది. ఈ నేపథ్యంలో బుధవారం దర్శకుడు అనిల్ రావిపూడి పాత్రికేయులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' అపూర్వ విజయంతో పాటు తన పదేళ్ల సినీ ప్రయాణం గురించి అనేక సంగతులను పంచుకున్నారు..


- ప్రేక్షకుల మద్దతుతో ఈ పదేళ్లలో అన్నీ సక్సెస్‌లే చూశాను. ఏ జోనర్ సినిమా చేసినా వారు నన్ను ఆదరించారు. నా విజయాల తాలూకు గొప్పదనమంతా ప్రేక్షకులదే. ఇక నా కెరీర్‌లో 'సంక్రాంతి వస్తున్నాం' ఓ అద్భుతం. వారం రోజుల్లో 200కోట్లు వసూలు చేయడం మామూలు విషయం కాదు. నా కెరీర్‌లోనే ఈ సినిమా ఒక హిస్టరీ.
- ప్రేక్షకులకు పైసా వసూల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వడమే నా టార్గెట్. నేను సినిమాలు చూస్తూ విజిల్స్ కొట్టిన హీరోలను డైరెక్ట్ చేయడం మరపురాని గొప్ప అనుభవం. కల్యాణ్‌రామ్ 'పటాస్'తో దర్శకుడిగా అవకాశమిచ్చారు. ఆయన లేకపోతే నా కెరీర్ లేదు. ఆ పదేళ్లలో సాయిధరమ్‌తేజ్, రవితేజ, వెంకటేష్, మహేష్‌బాబు వంటి స్టార్లతో సినిమాలు చేశా. ఈ ప్రయాణంలో వారందరితో వ్యక్తిగతంగా గొప్ప అనుబంధం ఏర్పడింది.
- 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు లభిస్తున్న ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి. 'మా అమ్మ ముప్పైఏళ్ల తర్వాత సినిమాకు వచ్చింది' అని ఓ ఫ్రెండ్ ఫొటో షేర్ చేశాడు. కొంతమంది వృద్ధులు వీల్‌చైర్‌లో వచ్చి మరి సినిమా చూశామని చెబుతున్నారు. ఇది ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు వున్న బలం. నా బలం కూడా ఈ జోనరే. దర్శకుడిగా వినోదమే నా ఆయుధం.
- చిరంజీవిగారితో చేయబోయే సినిమా గురించి ఇప్పుడే మాట్లాడలేను. ఎలాంటి జోనర్‌లో సినిమా చేయాలనే విషయం మీద మా టీమ్ కసరత్తులు చేస్తున్నది. అందరూ ఊహించినదానికంటే గొప్పగా చిరంజీవిగారిని కొత్త పంథాలో ప్రజెంట్ చేయాలనే సంకల్పంతో ఉన్నాం. నేను చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్ సినిమాలు చూస్తూ పెరిగాను. నా దృష్టిలో వారు ఫోర్‌పిల్లర్స్. ఇప్పటికే వెంకటేష్, బాలకృష్ణతో సినిమాలు చేశా. చిరంజీవిగారితో ప్రాజెక్ట్ ఓకే అయింది. భవిష్యత్తులో నాగార్జునగారితో తప్పకుండా సినిమా చేస్తా. ఆయనతో 'హలో బ్రదర్'లాంటి సినిమా చేయాలనుంది. అది పూర్తయితే నేను సినిమాలు చూస్తూ పెరిగిన ఫోర్‌పిల్లర్స్‌తో పని చేశాననే రికార్డు కూడా ఉంటుంది.

# కామెడీ, యాక్షన్‌లతో మద గజ రాజా



విశాల్ కథానాయకుడిగా సుందర్ సి దర్శకత్వంలో రూపొందిన 'మద గజ రాజా' చిత్రం ఇటీవలే సంక్రాంతి సందర్భంగా తమిళంలో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. వరలక్ష్మి, అంజలి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 31న తెలుగులో విడుదల చేయబోతున్నారు. 'బాల్య మిత్రులందరూ ఓ పెళ్లి వేడుకలో కలుసుకుంటారు. అక్కడ మొదలైన ఓ వివాదం అనుకోని పరిస్థితులకు దారితీస్తుంది. ఈ నేపథ్యంలో మిత్ర బృందం ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారన్నదే ఈ చిత్ర ఇతివృత్తం. కామెడీ, యాక్షన్ కలబోతగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంతానం కామెడీ ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, నిర్మాణం: జెమినీ ఫిలిం సర్క్యూట్, తెలుగు రిలీజ్: సత్యకృష్ణన్ ప్రొడక్షన్.

## సెమీస్‌కు సిన్నర్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ సెమీఫైనల్స్ చేరాడు. రాడ్‌లీవర్ ఎరీనా వేదికగా బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఈ ఇటలీ కుర్రాడు.. 6-3, 6-2, 6-1తో ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినార్‌పై అలవోకగా గెలిచాడు. మరో మ్యాచ్‌లో అమెరికా యువ సంచలనం బెన్ షెల్టన్.. 6-4, 7-5, 4-6, 7-6 (7/4)తో లొరెంజజో(ఇటలీ)ని ఓడించి ఈ టోర్నీలో తొలిసారి సెమీస్‌కు అర్హత సాధించాడు. సెమీస్ పోరులో షెల్టన్.. సిన్నర్‌తో తలపడనున్నాడు.

**స్వియాటెక్.. తగ్గేదేలే!**

మహిళల సింగిల్స్‌లో పోలండ్ అమ్మాయి ఇగా స్వియాటెక్.. ఈ టోర్నీలో తన ఆధిపత్యాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. క్వార్టర్స్ పోరులో స్వియాటెక్ 6-1, 6-2తో ఎమ్మా నవర్రో (యూఎస్‌ఏ)ను చిత్తుచేసింది.మరో మ్యాచ్‌లో 19వ సీడ్ మాడిసన్ కీస్ 3-6, 6-3, 6-4తో ఎలీనా స్వితోలినా(ఉక్రెయిన్)ను ఓడించి సెమీస్ చేరింది. సెమీస్‌లో స్వియాటెక్, కీస్ అమీతుమీ తేల్చుకోనున్నారు.




## సంహితకు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కాకినాడ వేదికగా జరిగిన 13వ జాతీయ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన సంహిత పుంగవనం స్వర్ణ పతకంతో మెరిసింది. ఐదు రోజుల పాటు సాగిన టోర్నీలో బాలిక అండర్-11 విభాగంలో బరిలోకి దిగిన సంహిత 7.5/9 పాయింట్లు సాధించి టైటిల్ విజేతగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రిశిత రెండో స్థానం దక్కించుకుంది. ఈ ఏడాది ఏషియన్ టోర్నీతో పాటు వరల్డ్ స్కూల్ పోటీల్లో సంహిత బరిలోకి దిగుతున్నది.

ఆట

# అభిషేక్ విధ్వంసం

**ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం • రాణించిన అర్ష్‌దీప్, వరుణ్**




అభిషేక్ (79)

కోల్‌కతా: స్వదేశంలో ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను యంగ్ ఇండియా ఘన విజయంతో ఆరంభించింది. ఈడెన్ గార్డెన్ వేదికగా బుధవారం ఆ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో బోణీ కొట్టింది. బ్యాటింగ్ ప్యారడైజ్‌గా పిలిచే ఈడెన్ గార్డెన్‌లో విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ (34 బంతుల్లో 79, 5 ఫోర్లు, 8 సిక్సర్లు) ఇంగ్లిష్ బౌలర్లపై పిడుగులా విరుచుకుపడటంతో టీమ్‌ఇండియా భారీ విజయం సాధించింది. తొలుత భారత బౌలర్లు కట్టడి చేయడంతో టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. నిర్ణీత ఓవర్లలో 132 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టులో సారథి జోస్ బట్లర్ (44 బంతుల్లో 68, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు. అనంతరం లక్ష్యాన్ని భారత్.. 12.5 ఓవర్లలోనే ఊదేసింది. అభిషేక్‌తో పాటు సంజూ శాంసన్ (20 బంతుల్లో 26, 4 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (19 నాటౌట్) రాణించారు. వరుణ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**బట్లర్ ఒక్కడే**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్‌ను ఆరంభ ఓవర్లలో అర్ష్‌దీప్ దెబ్బతీస్తే మధ్య ఓవర్లలో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్.. ఇంగ్లిష్ బ్యాటర్ల పనిపట్టారు. అర్ష్‌దీప్ వేసిన తొలి ఓవర్లో మూడో బంతికే సాల్ట్.. శాంసన్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. తన రెండో ఓవర్లో అర్ష్‌దీప్.. బెన్ డకెట్ (4)నూ ఔట్ చేయడంతో ఇంగ్లండ్ ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత సారథి జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్ (17) మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టే యత్నం చేశారు. అయితే చక్రవర్తి.. ఒకే ఓవర్లో బ్రూక్, ప్రమాదకర లివింగ్‌స్టోన్‌ను ఔట్ చేయడంతో పర్యాటక జట్టు కోలుకోలేకపోయింది. బెథెల్ (7), ఓవర్టన్ (2) సైతం క్రీజులో నిలవలేకపోయారు. 34 బంతుల్లో అర్ధశతకం పూర్తిచేసిన బట్లర్‌ను చక్రవర్తి 17వ ఓవర్లో పెవిలియన్‌కు పంపడంతో ఇంగ్లండ్ తక్కువ స్కోరుకే పరిమితమైంది.

**అభిషేక్.. బాదుడే బాదుడు**

స్వల్ప ఛేదనను భారత్ దూకుడుగా ఆరంభించింది. జోఫ్రా ఆర్చర్ తొలి ఓవర్లో ఒక్క పరుగే రాబట్టిన ఓపెనర్ శాంసన్.. అట్కిన్సన్ రెండో ఓవర్లో 4, 4, 6, 4, 4 తో 22 పరుగులు పిండుకున్నాడు. ఆర్చర్ మూడో ఓవర్లో అభిషేక్ 4,6 బాదాడు. అతడే వేసిన 5వ ఓవర్లో మూడు బంతుల వ్యవధిలోనే శాంసన్, సూర్యకుమార్ నిష్క్రమించారు. ఈ ఇద్దరూ నిష్క్రమించినా అభిషేక్.. ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రషీద్ 8వ ఓవర్లో 4తో పాటు డీప్‌మిడ్ వికెట్, లాంగాన్ మీదుగా రెండు భారీ సిక్సర్లు బాదాడు. 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసిన అతడు ఆ తర్వాత మరింత జోరు పెంచాడు. అట్కిన్సన్ 11వ ఓవర్లో 6, 4 సాధించిన అతడు.. ఆ తర్వాత మరో రెండు భారీ సిక్సర్లు బాది భారత్‌కు విజయానికి చేరువ చేశాడు. ఆఖర్లో అతడు ఔట్ అయినా తిలక్ వర్మ లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**అర్ష్‌దీప్@1**

టీ20లలో అర్ష్‌దీప్ భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డులకెక్కాడు. మ్యాచ్‌లో బెన్ డకెట్ వికెట్ అతడి టీ20 కెరీర్‌లో 97వది. ఈ క్రమంలో అతడు యుజ్వేంద్ర చాహల్ (96) రికార్డును అధిగమించాడు. చాహల్ 80 ఇన్నింగ్స్‌లలో 96 వికెట్లు సాధిస్తే.. అర్ష్‌దీప్ 61 ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత అందుకున్నాడు.

**సంక్షిప్త స్కోర్లు:**

**ఇంగ్లండ్:** 20 ఓవర్లలో 132 ఆలౌట్ (బట్లర్ 68, బ్రూక్ 17, వరుణ్ 3/23, అర్ష్‌దీప్ 2/17)
**భారత్:** 12.5 ఓవర్లలో 133/3 (అభిషేక్ 79, శాంసన్ 26, ఆర్చర్ 2/21, రషీద్ 1/27)




## త్రోబాల్ ప్లేయర్ కృష్ణవేణికి చేయూత

**కేటీఆర్ చేతుల మీదుగా ఎన్‌ఆర్‌ఐ ఆర్థిక సాయం**

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 22 : ఏషియన్ పారా త్రో బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన నిరుపేద పారా ప్లేయర్ మాచర్ల కృష్ణవేణికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఎన్‌ఆర్‌ఐ హరీశ్ రెడ్డి బుధవారం ఆర్థిక సాయం అందించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన కృష్ణవేణి మార్చి 28 నుంచి 30 వరకు కాంబోడియాలో జరిగే త్రోబాల్ పోటీల్లో పాల్గొననున్నది. రవాణా, హోటల్, ఫుడ్, రిజిస్ట్రేషన్, కోచింగ్, దుస్తులు, ప్రవేశ రుసుం వంటి ఖర్చులకు గాను రూ.89 వేలు చెల్లించాల్సి ఉంటుందని, దాతలు సహకరించాలంటూ ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఈ విషయం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్‌ఆర్‌ఐ హరీశ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన ఆర్థిక సహాయాన్ని హైదరాబాద్‌లో కేటీఆర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృష్ణవేణిని అభినందించారు. క్రీడా పోటీలలో పాల్గొనేందుకు పరోక్షంగా సహకరిస్తూ, మద్దతు ఇస్తున్న కేటీఆర్, హరీశ్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు కృష్ణవేణి కృతజ్ఞతలు తెలిపింది.

## సింధు నిష్క్రమణ

ఇండోనేషియా ఓపెన్



జకర్తా: ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రోజు భారత్‌కు నిరాశజనక ఫలితాలు వచ్చాయి. పీవీ సింధు, కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ వంటి స్టార్ షట్లర్లు తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. మహిళల సింగిల్స్‌లో సింధు 20-22, 12-21తో తుయ్ లిన్హ్ (వియత్నాం) చేతిలో ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో రజావత్ 14-21తో నరోక (జపాన్) చేతిలో ఓడగా జియోన్ జిన్ (దక్షిణ కొరియా) 21-12, 21-10తో కిరణ్‌ను ఇంటికి పంపించాడు. లక్ష్యసేన్.. 21-9, 21-14తో ఒబయాషి (జపాన్)పై గెలిచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల.. 21-18, 21-14తో అద్నాన్ మౌలానా-సారి జమిల్ (మలేషియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు చేరారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.